నేడు టామాటా కిలో రూ.48



విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో గురువారం టమాటాను కిలో రూ.48 చొప్పున విక్రయించనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. టమాటా ధర బయట మార్కెట్‌లో భారీగా పెరిగినందున ఆ ధరలు దిగి వచ్చేంత వరకు రైతుబజార్లలో రాయితీ ధరపై విక్రయించనున్నట్టు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో టోకున కొని లాభం లేకుండా కొన్న ధరకే ఇక్కడ విక్రయిస్తున్నామన్నారు. సోమవారం ఈ ధర కిలో రూ.58 ఉండగా, మంగళవారం రూ.61, బుధవారం రూ.54 చొప్పున విక్రయించారు. ఇప్పుడు ధర తగ్గడంతో రూ.48 చొప్పున అమ్ముతున్నామని వివరించారు.



భూమి కేటాయించాకే రైల్వే జోన్ పనులు

- బడ్జెట్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు రూ.10,586 కోట్లు
- వాల్తేరు డివిజన్ కూడా అందులో భాగమే...
- అమృత్ స్టేషన్ల కింద విశాఖపట్నం, దువ్వాడ, సింహాచలం, అనకాపల్లి, ఎలమంచిలి, అరకులోయ అభివృద్ధి
- కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయదలచిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జీవీఎంసీ అధికారులు తగిన స్థలం కేటాయించాకే పనులు ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. 2024-25కి సంబంధించిన రైల్వే బడ్జెట్‌పై ఆయన బుధవారం ఢిల్లీలో మాట్లాడారు. విశాఖ జిల్లా అధికారుల వల్లే జోన్ పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఈ బడ్జెట్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్ ఉన్న ఒడిశా రాష్ట్రానికి రూ.10,586 కోట్లు కేటాయించారు. వాల్తేరు డివిజన్ కూడా అందులో భాగమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.9,151 కోట్లు కేటాయించామని, 100 శాతం రైల్వే ట్రాకులను విద్యుద్దీకరణ చేశామన్నారు. గత పదేళ్లలో ఏపీలో ఏడాదికి సగటున 151 కి.మీ. చొప్పున కొత్త ట్రాకుల నిర్మాణం చేపట్టామన్నారు. భద్రత కోసం అనేక ప్రాంతాల్లో అండర్ పాస్ వేలు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరిగిందన్నారు. ఏపీలో రూ.73,743 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. విశాఖపట్నం జిల్లా వరకు చూసుకుంటే విశాఖపట్నం, దువ్వాడ, సింహాచలం, అనకాపల్లి, ఎలమంచిలి, అరకు రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్ల కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ప్రతి నెలా జాబ్ క్యాలెండర్

- ఆగస్టు 15 తరువాత అమలు
- వచ్చే మార్చి నాటికి జిల్లాలో పది వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట, జూలై 24: జిల్లాలో వచ్చే ఏడాది మార్చి నాటికి పది వేల మందికి తగిన శిక్షణను అందించి, ఉపాధి కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. సాయికృష్ణను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూరల్ సెల్ఫ్ ఎంప్లా యిమెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ఎంతమందికి శిక్షణ అందించి, ఉపాధి కల్పించగలరో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జాబ్‌మేళాలు నిర్వహించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని, వచ్చే నెల 15వ తేదీ తరువాత ప్రతి నెలా జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలని, జాబ్ క్యాలెండర్‌లో నిర్దిష్ట తేదీ, సమయం, సంస్థల్లోని ఖాళీలు, అర్హతలు తదితర వివరాలు స్పష్టం గా ఉండాలన్నారు. విడుదల చేసిన పోస్టులన్నీ భర్తీ అయ్యేలా ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. వివిధ రంగాలలో ఖాళీ పోస్టుల వివరాలను సేకరించి, అందుకు అనుగుణమైన శిక్షణను అం దించి, ఉపాధి కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు సీహెచ్ గణపతి. ఆర్.మురళీ మోహన్, ఎంఎస్ శోభారాణి పాల్గొన్నారు.

3 గంజాయి నియంత్రణ · మహిళలకు రక్షణ · రౌడీషీటర్లకు ముకుతాడు

నగర ప్రశాంతతను కాపాడేందుకు ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం



విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రధానంగా మూడు అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. గంజాయి వినియోగం, విక్రయానికి అడ్డుకట్ట వేయడం, మహిళలు, బాలికలపై దాడులు, వేధింపులు అరికట్టడం, రౌడీషీటర్లు, ల్యాండ్ గ్రాబర్లకు ముకుతాడు వేయడం... ఈ మూడింటితోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నానన్నారు. ఈనెల ఒకటో తేదీన నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంఖబ్రత బాగ్చీ... 'నా పనితీరు ఎలా ఉంటుందో మాటల్లో కాదు...చేతల్లో చూపిస్తాను' అని ప్రకటించారు. అన్నట్టుగానే స్వల్పకాలంలోనే తన పనితీరుతో ప్రజల మన్ననలు పొందుతూనే అవినీతిపరుల్లో గుబులు పుట్టిస్తున్నారు. సీపీగా తన ప్రాధాన్యాలు, అందుకోసం అమలు చేయబోయే కార్యాచరణను ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

- గంజాయి నియంత్రణకు కార్యాచరణ అమలు
- మహిళలు, బాలికలను వేధిస్తే రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం...నగరం నుంచి బహిష్కరిస్తాం
- రౌడీషీటర్లపై ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తు ఆగస్టు 31 నాటికి పూర్తి
- రాత్రి వేళ నేరాల నియంత్రణకు పోలీస్ స్టేషన్‌ల వారీగా ప్రత్యేక పెట్రోలింగ్
- భూకబ్జాలకు పాల్పడేవారిపై ల్యాండ్ గ్రాబింగ్ షీట్
- జీవీఎంసీతో కలిసి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం
- పోలీస్ శాఖలో అవినీతిపరులపై త్వరలోనే చర్యలు
- సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు విశేష స్పందన
- పోలీసులపై ప్రజల్లో పెరిగిన నమ్మకం
- సమస్య వస్తే ఏ సమయంలోనైనా నాకు ఫోన్ చేయండి
- ప్రజల భద్రతతోపాటు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గంజాయి నియంత్రణకు కార్యాచరణ

నగరంలో గంజాయి వినియోగం, విక్రయం ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయింది. చాలామంది యువత గంజాయి మత్తులో నేరాలకు తెగబడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. నగరంలో డైనమిక్ చెకింగ్స్ పేరుతో తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. దీనివల్ల గంజాయి వినియోగదారులతోపాటు విక్రయదారులు, ఇతర నేరాలకు పాల్పడుతున్నవారిని గుర్తించి కేసులు నమోదు చేసేందుకు అవకాశం ఏర్పడుతోంది. ఏరోజు ఎక్కడ తనిఖీ చేస్తామనేది సిబ్బందికి సైతం ముందు చెప్పకుండా అప్పటికప్పుడు చేస్తున్నాం.

మహిళలపై వేధింపులకు పాల్పడితే నగర బహిష్కరణ

నగరంలో మహిళలు, బాలికలపై అత్యాచారం, లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తాం. అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేయడం లేదనుకుంటే నగర బహిష్కరణ వేటు వేస్తాం. విద్యార్థులపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు డెకాయి బృందాలను ఏర్పాటుచేశాం. విద్యార్థుల మాదిరిగా మహిళా కానిస్టేబుళ్లు కాలేజీలు, బస్‌స్టాపుల్లో ఉండి పోకిరీలు, ఈవ్‌టీజింగ్ చేసేవారి భరతం పడతారు. మైనర్లు, మహిళలపై అఘాయిత్యాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, అలాంటివి జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. వన్‌సైడ్‌లవ్ పేరిట వేధించే వారిని, కాలేజీల నుంచి ఇంటికి వెళ్లేటపుడు టీజింగ్ చేసేవారిని గుర్తించి వారిపై ఫిర్యాదు లేకపోయినా కేసులు నమోదుచేసి జైలుకి పంపిం చేస్తాం. అలాకానిపక్షంలో ఏదో ఒకరోజు అమ్మాయి ఇంటికి వెళ్లి ఏదైనా ఘాతుకానికి పాల్పడే ప్రమాదం పొంచి ఉంటుంది.

సీపీ హెల్ప్‌లైన్ నంబర్

7995095799

గంజాయి, మత్తుమందులకు బానిస అయిన వారిని తిరిగి మామూలు మనుషులుగా మార్చేందుకు 'మార్పు' పేరుతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

నగరంలో రౌడీషీటర్లు కొందరు భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లు, దందాలకు పాల్పడుతున్నారు. కొంతమంది... మిగతా 6వ పేజీలో

ఆర్డీ కార్యాలయాన్ని గాడిలో పెడతా



- వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి.రామగిడ్డయ్య
- పదోన్నతులు, బదిలీలు, నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై విచారణ కొనసాగుతుంది
- సంబంధం లేని వ్యవహారాలకు దూరంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించా

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రాంతీయ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ బి.రామగిడ్డయ్య పేర్కొన్నారు. ఆర్డీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో పలు అంశాలపై మాట్లాడారు. ప్రాంతీయ కార్యా లయం కేంద్రంగా నిర్వహిస్తున్న జోనల్ ఉద్యోగుల పదోన్న తులు, ఇంక్రిమెంట్లు, క్రమశిక్షణ వ్యవహారాలు, నియా మకాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా బదిలీలు, పదోన్నతులు సమయాల్లో ఆర్డీ కార్యాలయంపై పెద్దఎత్తున ఆరోపణలు రావడం పరిపాటిగా మారిందని, ఇటువంటి వాటికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు రామగిడ్డయ్య తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. గతంలో ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై విచారణ కొనసాగుతున్నదన్నారు. పెండింగ్‌లో ఉన్న విచారణ ఫైళ్లను క్లియర్ చేయనున్నట్టు వెల్లడించారు.

ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో 20కిపైగా కేడర్లలో పనిచేసే నాలుగు వేల మంది వరకు ఉద్యోగులు తమ పరిధిలో ఉన్నట్టు ఆయన వివరించారు. ప్రాంతీయ కార్యాలయ పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చునన్నారు. నిరంతరం ఉద్యోగులకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సంబంధం లేని వ్యవహారాలకు దూరంగా ఉండాలని కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కొద్దిరోజుల కిందట ... మిగతా 6వ పేజీలో

మృతులకు ఇళ్ల స్థలాలు!



వేములవలస లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం

అడ్డగోలుగా వ్యవహరించిన ఆనందపురం రెవెన్యూ అధికారులు

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు వేములవలస లేఅవుట్‌లో స్థానికేతరులకు, బినామీలకు స్థలాలు
- కొంతమంది లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చి ముందే చేజిక్కించుకున్న వైసీపీ నేతలు
- వారికి రోడ్డుపక్కన స్థలాలు కేటాయింపు

విశాఖపట్నం/ఆనందపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

పేదల కోసం ఆనందపురం మండలం వేములవలసలో రూపొందించిన లేఅవుట్‌లో మృతిచెందినవారికి, స్థానికేతరులకు ఇళ్ల పట్టాలు మంజూరుచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిరోజుల ముందు జరిగిన ఈ పట్టాల పంపిణీలో అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై, నిబంధనలను పక్కనపెట్టేశారు. తమకు నచ్చిన వారికి స్థలాలు ఇచ్చుకున్నారు.

గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతంలో అర్హులైన పేదలకు సెంటున్నర (72 గజాలు) చొప్పున స్థలం కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆనందపురం మండలం వేములవలసలో జాతీయ రహదారికి ఆనుకుని 470 మందికి సెంటున్నర వంతున ఇవ్వడానికి ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే ఆ భూమిలో కొంత భాగంపై కొందరు కోర్టుకు వెళ్లారు. వివాదం లేని భూమిలో 270 మందికి పట్టాలు ఇవ్వవచ్చునని అధికారులు గుర్తించారు. ఆ లేఅవుట్ జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో పలువురు వైసీపీ నేతలు ఎంపికైన లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చి అనధికారికంగా సెంటున్నర భూమిని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు ముందుగానే కొనుగోలు చేశారు. ఆ లేఅవుట్‌లో 270 మందికి పట్టాల పంపిణీ చేసేందుకు జాబితా సిద్ధం చేసిన అధికారులు ఈ ఏడాది మార్చిలో వైసీపీ నేతల ముందుంచారు. టీడీపీ నేతలు జోక్యంచేసుకుని 270 మంది లబ్ధిదారులకు లాటరీ ద్వారా పట్టాలు పంపిణీ చేయాలని ప్రతిపాదించగా వైసీపీ నేతలు ఒప్పుకోకుండా తమకు నచ్చినవారికి నచ్చినచోట కేటాయించుకున్నారు. ఈ విషయంలో అధికారులు కూడా వైసీపీ నేతలకు వత్తాసు పలికారు. చివరకు ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిరోజుల ముందు 100 మందికి పట్టాలు ఇచ్చారు. అందులో చనిపోయినవారు నలుగురు, స్థానికేతరులు నలుగురు, అధికారుల బినామీలు ముగ్గురు ఉన్నారు. మిగిలిన 170 మందికి తరువాత పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. నిబంధనల మేరకు పట్టాలు పంపిణీ లాటరీ ద్వారా చేయాల్సి ఉన్నా రోడ్డుకు ఆనుకుని తమకు, తమకు అనుకూలురైన వారికి కేటాయించేలా వైసీపీ నేతలు చక్రం తిప్పారు. అయితే పట్టాలు పంపిణీ చేసిన 89 మందిలో నలుగురు అప్పటికే మృతిచెందినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. మజ్జి అప్పలకొండ, సారిక ఆదెమ్మ, విజినిగిరి అప్పలనరసమ్మ, సింగం నారాయణమ్మలు మృతిచెందినా వారి పేర్లతో ఇళ్ల స్థలాలు కేటాయించారని స్థానికులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరో నలుగురు స్థానికేతరుల పేర్లను చేర్చారని, ఈ నాలుగు పేర్లు రెవెన్యూ అధికారులకు చెందినవారివిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఈ ఏడాది మార్చిలోనే ప్రస్తుత తహసీల్దారును టీడీపీ నేతలు కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు ఆనుకుని లేఅవుట్ ఉండడంతో లబ్ధిదారుల నుంచి కొందరు వైసీపీ నేతలు కొనుగోలు చేశారని, ప్రస్తుతం అక్కడ ఇళ్లు కడుతున్న వారెవరో విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయని అంటున్నారు. వేముల వలసలో ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలపై భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు బుధవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతోపాటు జాబితాలో ఉన్న మృతులు, స్థానికేతరులకు ఇచ్చిన పట్టాలను రద్దుచేయాలని కోరారు. ఇదే లేఅవుట్‌లో భూమి చదును సమయంలో గుట్టను కొట్టి అక్రమంగా మట్టి, రాయి తరలించుకుపోయినట్టు అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వార్త ప్రచురించడంతో వైసీపీ నేతకు గనుల శాఖ నోటీస్ ఇచ్చింది.

జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



కమాండ్‌కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

- ప్రధాన కార్యాలయంలో ప్రతి విభాగం పరిశీలన
- మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం
- 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?'...అంటూ కార్యాలయం ఇన్‌చార్జిపై అసహనం
- ముఖ్యమైన ఫైళ్లను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులకు ఆదేశం
- ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని సూచన

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్ బుధవారం కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు వినియోగించే మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యాలయం ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వరరావును పిలిచి 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?' అని ప్రశ్నించారు. కార్యాలయ ఆవరణతోపాటు మరుగుదొడ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగంలో కారిడార్‌కు ఇరువైపులా ఇనుప బీరువాల్లో ఫైళ్లను ఉంచడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఫైళ్లను ఎవరైనా తస్కరిస్తే ఎవరు ... మిగతా 6వ పేజీలో

ఆ జాబితాలో స్టీల్‌ప్లాంటును చేర్చండి

- ప్రైవేటీకరణ ప్రతిపాదనను ఉపసంహరించుకోనున్న సంస్థల జాబితాలో ఉక్కు కర్మాగారం పేరు చేర్చండి
- లోక్‌సభలో ఎంపీ ఎం.శ్రీభరత్ విజ్ఞప్తి
- రైల్వే జోన్ పనులు త్వరితగతిన చేపట్టాలి



లోక్‌సభలో శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటామని కేంద్రం ప్రకటించిన 200 ప్రభుత్వ రంగ సంస్థల జాబితాలో విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని చేర్చాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కోరారు. బుధవారం ఆయన లోక్‌సభలో బడ్జెట్‌పై మాట్లాడారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారం, రైల్వేజోన్ గురించి ప్రత్యేకించి ప్రస్తావించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అందుకు అవసరమైన మార్గదర్శకాలను కేంద్రం అందజేయాలన్నారు. విశాఖ రైల్వేజోన్ పనులు త్వరితగతిని చేపట్టి, పూర్తిచేయాలని ఆయన కోరారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలా ఉందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు సాయం, పోలవరం ప్రాజెక్టు పూర్తికి హామీ, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం, మూలధన వ్యయం కోసం సాయం వంటివి రాష్ట్రానికి లబ్ధి చేకూర్చుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

వీడని ముసురు

- నగరంలో ఉదయం నుంచీ చిరుజల్లులు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రోజంతా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వర్షంతో పాటు చల్లని గాలులు వీయడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా మరో రెండు రోజులు ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు.



విస్తృత తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సెబ్ పోలీసులు

సీతమ్మధార, జూలై 24: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసి స్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వ ర్యం లో సెబ్ ఇన్‌స్పెక్టర్ టీవీఏ నా యు డు, సెబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజుల నాయుడు, ఎస్సైలు వి.వేణుగోపాల్, జి.దాస్, సిబ్బంది రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వా డ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవా ణా అడ్డుకట్టకు చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరు ఖరారుపై హర్షం

జగదాంబ కూడలి, జూలై 24: తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారాకరామారావు పేరును వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఖరారు చేస్తూ అసెంబ్లీలో సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడంపై అన్న ఎన్టీఆర్ సేవా సమితి నగర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం జగదాంబ దరిలోని సంస్థ కార్యాలయంలో ప్రతినిధులు వేగి రాధాకృష్ణ, యల్లా సత్యనారాయణ, డి.సత్యనారాయణ, దుక్కల మూర్తి, కె.శ్రీనివాసరావు, డి. యోగి, గోవింద్, ప్రకాశ్, అప్పలరాజు, ఎన్టీఆర్ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలపై కూటమి ప్రభుత్వం సత్వర చర్యలకు దిగడం అభినందనీయమన్నారు.



ఉడాకాలనీలో గ్యాస్ గొడౌన్ దారిలో రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాలు



ఆర్టీఏ కార్యాలయం మార్గంలో రోడ్డు ఆక్రమణ

ప్లాన్‌లో ఒకలా.. నిర్మాణం వేరొకలా..!

» బిల్డర్ల ఇష్టారాజ్యం
» ఉత్తర నియోజవర్గ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
» సచివాలయ కార్యదర్శులు వత్తాసు

మురళీనగర్, జూలై 24 ; విశాఖ ఉత్తర నియోజవర్గంలోని బిల్డర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. అయినా, జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ కొరవడుతుండడంపై తీవ్ర విమర్శలు తలెత్తున్నాయి. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణాల పరిశీలనకు వార్డుల్లో ఉండే చైన్‌మన్‌లను తొలగించి పూర్తి అధికారాలు వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించింది. దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. దీంతో వార్డుల్లో నిర్మాణాల్లో దర్జాగా ప్లానింగ్ సెక్రటరీలు, స్థానిక ప్రజాప్రతినిధులు బిల్డర్ల నుంచి యథేచ్ఛగా మామూళ్లు వసూలు చేస్తూ.. నిబంధనలను తుంగలో తొక్కుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 51వవార్డు మాధవధార ఉడాకాలనీలో జోరుగా సాగుతున్న నిర్మాణాలపై కనీసం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు దృష్టి సారించడం లేదు. దీంతో పరదాలచాటున నిర్మాణాలు సాగిపోతున్నాయి. ప్లాన్ మంజూరైన తర్వాత అటు వైపు చూడటం లేదు. జోన్-5లో ఓ బిల్డింగ్ ఇన్‌స్పెక్టరు దిశానిర్దేశంలో కొత్త సచివాలయ సిబ్బంది ఈ అక్రమాల్లో ముందుసాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నారు. బిల్డర్లు ప్లానులో చూపేది ఒకటి.. వాస్తవంగా క్షేత్రస్థాయిలో మరోలా ఉన్నా చర్యలు తీసుకోవడంలేదని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కళింగనగర్ సచివాలయం 291 పరిధిలో ఓ బహుళ అంతస్థును నిబంధనలు అతిక్రమించి కట్టారు. దీంతో ఆ బిల్డరు ఆ ప్లాను ఇచ్చిన సెక్రటరీ జరిమానాతోపాటు, తన వద్ద నుంచి అనధికారికంగా సొమ్ము గుంజినట్టు ఆయన ఫిర్యాదు చేస్తున్నారు. ఇక, సచివాలయ సిబ్బంది అండదండలున్న బిల్డర్లు యథేచ్ఛగా గెడ్డలను ఆ క్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. రోడ్లను ఆక్రమించి తమ భవనాల ఎదుట ప్రత్యేక ఆర్చ్‌లు, పచ్చదనం పేరిట పార్కింగ్ స్థలాల్ని దాటి, తమ సెట్‌బ్యాక్ స్థలాన్ని వదలకుండా నిర్మాణాలు చేస్తున్నారు. కాలువలను కప్పేసి కుండీలు కడుతున్నారు. వారి అదనపు పార్కింగ్‌కి రోడ్డుని వాడుకుని కట్టడాలు చేప డుతున్నారు. దీంతో ఆర్టీఏ కార్యాలయం వద్ద నిత్యం రద్దీగా ఉండే దారిలో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి.

అన్నదానానికి నిత్యావసరాలు వితరణ

పూర్ణామార్కెట్, జూలై 24: టౌన్ కొత్తరోడ్డు శ్రీ జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న మహా అన్నదాన కార్యక్రమానికి వెంకటేశ్వర ట్రస్ట్ అధినేత వాకాడ రాధ రూ.50వేల విలువైన బియ్యం, కిరాణా సరకులను 29 వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు చేతుల మీదుగా బుధవారం ఈవో టి. రాజగోపాలరెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర హాస్పిటల్స్ అధినేత వి.వి. రావు, పెదసాయి, టీడీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా పర్యావరణ పరిరక్షణ



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

జ్ఞానాపురం, జూలై 24: కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆదేశాలమేరకు బుధవారం స్థానిక సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి కె.మాణిక్య కుమారి, బోటనీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్. నాగరాజు, డాక్టర్ ఎం.పద్మ సుందరి, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కథానికలు సమాజానికి దర్పణం

సీతమ్మధార, జూలై 24 : సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజం కాలేజీలో కథా కచేరీ నిర్వహించారు. వైవిధ్యభరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఔత్సాహిక రచయితలు ఏమి చెప్పాలన్న అంశంతోపాటు ఎలా చెప్పాలన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. భావంతో పాటు శిల్పానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యదర్శి సీహెచ్ సూర్యనారాయణ బలివాడ కాంతారావు అడ్డదారి కథ చదివి విశ్లేషించారు. సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు కథలు, ఇతర సాహిత్య ప్రక్రియల ద్వారా సామాజిక స్థితులను తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, భాగవతుల సత్యనారాయణమూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, వీవీఆర్ కుమార్‌రావు, పరమేశ్వరరావు, బి.రాధారాణి, సురేష్, డీఎస్ కుమార్, వీకే శర్మ పాల్గొన్నారు.


జనసేనలో చేరికలు



పార్టీలో చేరిన మహిళలతో ఉత్తరం జనసేన కన్వీనర్ ఉషాకిరణ్

మర్రిపాలెం, జూలై 24: గ్రేటర్ 54వ వార్డు మర్రిపాలెం మహరాణివీధిలోని పలువురు మహిళలు బుధవారం ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి ఉషాకిరణ్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో కృషికి ఆకర్షితులై తమ పార్టీలో చేరేందుకు ఎంతో మంది ముందుకు వస్తున్నారన్నారు. పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 53, 54 వార్డుల పార్టీ ఇన్‌చార్జి నీరు కొండ దివాకర్, 54వ వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్, సభ్యులు పాండ్రంకి దివాకర్, కడిమి సీతారాం, దొగ్గా సురేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్ది



వినాయకుడు

అక్కయ్యపాలెం, జూలై 24: పోర్టు ఆస్పత్రి ఎదురుగా ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్ది పూజ బుధవారం రాత్రి అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్య శర్మ, కేవీ రమణ, గురుపాద సేవా సమితి సభ్యులు పాలల్గొన్నారు.

కొండవాలు గ్రామాలకు రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కంచరపాలెం, జూలై 24: జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాలైన పంచగ్రామాలకు రోడ్డు పనులను కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు బుధవారం ప్రారంభించారు. రోడ్డు లేక పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జీవిఎంసీ కౌన్సెల్‌లో నిధులను మంజూరయ్యేటట్టు కృషిచేశారు.ఈ నేపథ్యంలో పనులను ప్రారంభించారు.వీలైనంత త్వరలో నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలి

అల్లిపురం, జూలై 24: గ్రేటర్ 32వ వార్డు అల్లిపురం ప్రాంతంలోని నేరెళ్ల కోనేరు, పందావీధి, చలువతోటల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని జనసేన నాయకులు, కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. బుధవారం నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చీని కలసి వినతి పత్రం అందజేశారు.గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి యువత చెడిపోతున్నారని తెలిపారు. నేరాలకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలోవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌నుకలిసిన టీడీపీ నేత

అల్లిపురం: వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎస్ విశ్వనాథన్‌ను తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట దేవాలయ భూముల విషయంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వీవీ ఎస్ ఎన్ గుప్తా పాల్గొన్నారు.

జీవీఎం కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

పూర్ణామార్కెట్: గ్రేటర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించని సంపత్ కుమార్‌ను 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులో పరిధిలో కాలుష్యం, పారిశుద్ధ్యం తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కంచరపాలెం: జీవిఎంసీ కమిషనర్‌గా బాధ్యతులు చేపట్టిన పి.సంపత్‌కుమార్‌ను 55వార్డు టీడీపీ నాయకురాలు, తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. నగరాభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వార్డు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎల్ఎఫ్ ఆర్పీల సమావేశం

అక్కయ్యపాలెం, జూలై 24 : గ్రేటర్ 46వ వార్డు కైలాసపురంలో టీఎల్ఎఫ్ ఆర్పీల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక హాజరయ్యారు.

ఆటో డ్రైవర్లు సమష్టిగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార, జూలై 24 : డ్రైవర్లంతా ఐక్యంగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ అన్నారు. స్థానిక ఏఎస్ఆర్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం జరిగిన శ్రీ దుర్గా గణపతి ఆటో స్టాండ్ డ్రైవర్ల ససమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. డ్రైవర్లు ఖాకీ యూనిఫాం ధరించాలని, ఆటోల ఫిట్‌నెనెస్ సర్టిఫికెట్లు పక్కాగా ఉండాలన్నారు. ఆటోలో పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించరాదని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. నగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాల కోసం, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుకు (పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు చంటి, నాని, రవీంందర్ రెడడ్డి, గణేష్, రాజ్‌కుమార్, నాయుడు, సన్నీ, డీజే, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి సేవలు చిరస్మరణీయం



అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంథాలయ సంస్థ ఉద్యోగులు

జగదాంబ కూడలి, జూలై 24: గ్రంథాలయోద్యమకారుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణ్య 134 జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ఉద్యోగులు, ఉపగ్రంథాలయ అధికారి ఎల్.రాజేంద్ర వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అయ్యంకి వెంకటరమణ్య గ్రంథాలయాల స్థాపనకోసం చేసిన సేవలను, ఉద్యమాలను మననం చేసుకున్నారు. పాఠకులు, విద్యార్థులకు మిఠాయిలను పంచారు.

ఆర్డీ కార్యాలయాన్ని గాడిలో పెడతా

... 5వ పేజీ తరువాయి

సూపరింటెండెంట్లుగా 12 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించామన్నారు. నర్సింగ్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ట్యూటర్ గ్రేడ్-1 పోస్టుకు కొద్దిరోజుల్లో ప్రమోషన్ కల్పించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీహెచ్ఈవో), పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్) నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)గా పదోన్నతులు కల్పించేందుకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సిద్ధమవుతోందన్నారు. ఈ మేరకు జోన్-1 పరిధిలో పదోన్నతులకు సంబంధించి 40 వరకు ఖాళీలున్నట్టు గుర్తించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సమాచారాన్ని అందించా మన్నారు. ఆయా కేడర్లలో పదోన్నతులు పొందేందుకు అర్హులైన సీనియర్ జాబితాను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని పాటించాలని ఆదేశించినట్టు వెల్లడించారు.

గంజాయి నియంత్రణ, మహిళలకు రక్షణ..

... 5వ పేజీ తరువాయి

ఆధిపత్యం కోసం, సుపారీ కోసం హత్యలకు, దాడులకు సైతం తెగబడుతున్నారు. ఇలాంటి వారికి ముకుతాడు వేసేందుకు చర్యలు ప్రారంభించాం. తరచూ నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లను జనజీవన స్రవంతిలో ఉండకుండా చేసేందుకు వీలుగా వారిపై ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సిబ్బందిని ఇప్పటికే ఆదేశించాం. వచ్చే నెలాఖరు నాటికి కేసులు దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం ద్వారా వారికి శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం. కొంత మంది రౌడీషీటర్లు వెనకుండి చీటీల వ్యాపారం చేయిస్తున్నారని తెలిసింది. నగరంలో పోలీస్ స్టేషన్‌ల వారీగా చీటీ వ్యాపారాలకు సంబంధించిన జాబితా తయారుచేయాలని ఆదేశించాం. ఇప్పటికిప్పుడు చీటీల వ్యాపారం ఆపేసి చీటీలు కట్టినవారికి ఎంతకట్టారో అంతమొత్తం లెక్కించి తిరిగి ఇచ్చేయాలని ఆదేశించాం. ఇంకా ఎక్కడైనా చీటీల వ్యాపారం జరిగితే చర్యలకు గురికావాల్సి ఉంటుంది.

భూకబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ షీట్

నగరంలో భూకబ్జాలు, భూవివాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. గతంలో భూవివాదాలు, కబ్జాలకు సంబంధించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాటిని సివిల్ కేసులంటూ తీసుకునేందుకు నిరాకరించేవారు. కానీ భూకబ్జాలకు పాల్పడేవారు ముందుగా డాక్యుమెంట్లను డూప్లికేట్ చేయడం, సంతకాలను ఫోర్జరీ చేయడం చేస్తున్నారు. కాబట్టి వాటిని క్రిమినల్ కేసులుగానే గుర్తించాల్సి ఉంటుంది. అలాంటి వాటిపై ఇక నుంచి కేసులు నమోదుచేయాలని సీఐలను ఆదేశించా. భూకబ్జాలకు పాల్పడే వారిలో భయం పెరిగేందుకు వారిపై కూడా రౌడీషీటర్ల మాదిరిగానే ల్యాండ్‌గ్రాబింగ్ షీట్ ఓపెన్ చేస్తాం. వారి ఫొటోలు, వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శించాలని నిర్ణయించాం. దీనివల్ల భూకబ్జాలు, ఆక్రమణలకు పాల్పడాలంటే కొందరిలోనైనా భయంపడుతుంది.

తరచూ నేరాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ

మహిళలపై వేధింపులు, దాడులు జరుగుతున్న ప్రాంతాలు, గంజాయి వినియోగించే ప్రాంతాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. అలాంటి ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ద్విచక్ర వాహనంపై రక్షక్ బృందాలు తిరిగేలా చర్యలు తీసుకున్నాం. వీరంతా రాత్రి 12 గంటలు నుంచి తెల్లవారుజామున ఆరు గంటల వరకూ తమకు కేటాయించిన ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తారు. అలాగే నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు, పొదలు తొలగింపు, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఇప్పటికే సీసీ కెమెరాలు ఉండి పనిచేయకపోతే వాటిని రిపేరు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

అన్ని కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చర్యలు

నమోదుచేసిన అన్ని కేసుల్లోనూ నిందితులకు శిక్షపడేలా చర్యలు ప్రారంభించాం. కోర్టులో వీగిపోయే కేసులపై ప్రతి నెలా క్రైమ్ మీటింగ్ రోజున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేసు ఎందుకు వీగిపోయిందనేది సమీక్షిస్తాం. ఆ సమావేశానికి దర్యాప్తు అధికారులతోపాటు కోర్టులో పోలీసుల తరఫున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కూడా పిలుస్తాం. దీనివల్ల కేసు దర్యాప్తులో ఎక్కడ లోపం జరిగిందనేది తెలుసుకుని తర్వాత అలాంటి పొరపాటు జరగకుండా చేయవచ్చు. అలాగే కేసు ఒకవేళ వీగిపోయినా వెంటనే హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లేలా దర్యాప్తు అధికారులు, పీపీల మధ్య సమన్వయం ఏర్పడుతుంది. వచ్చే నెల క్రైమ్ మీటింగ్ నుంచే దీనికి శ్రీకారం చుట్టబోతున్నాం.

పాస్‌పోర్టు వెరిఫికేషన్ మూడు రోజుల్లో పూర్తిచేయాల్సిందే

నగరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. వెరిఫికేషన్‌కు వెళ్లే సిబ్బంది డబ్బులు ఇవ్వకపోతే వెరిఫికేషన్‌ను పెండింగ్‌లో ఉంచేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు వీలుగా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌కు సంబంధించి ప్రతి కానిస్టేబుల్ ప్రతి రోజూ ఎన్నిపెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని పూర్తిచేశామనే దానిపై డీఎస్ఆర్ ఇవ్వాలి. కానిస్టేబుల్ చేతికి వెరిఫికేషన్ ఫైల్ వస్తే దానిపై మూడు రోజుల్లోగా ఏదో నివేదిక అందజేయాల్సిందే. అలాకాకుండా పెండింగ్‌లో ఉంచితే మాత్రం అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అవినీతి పోలీసులపై త్వరలోనే చర్యలు

పోలీస్ శాఖలో పనిచేస్తున్న కొంతమంది అవినీతికి సంబంధించి ఆధారాలతో నాకు ఫిర్యాదులు అందాయి. వీటిపై ఇప్పటికే అంతర్గతంగా విచారణ జరిపించాం. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే అలాంటి వారిపై చర్యలు ఉంటాయి. సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడినా, పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంలో విఫలమైనా, ఫిర్యాదుదారుల పట్ల దురుసుగా ప్రవర్తించినా చర్యలు తప్పవు. ఈ విషయం ఇప్పటికే అందరికీ స్పష్టంచేశాం. స్టేషన్లలో ఇప్పటికీ జనరల్ కానిస్టేబుళ్ల వ్యవస్థ నడుస్తోందని నా దృష్టికి వచ్చింది. అలాగే క్రైమ్, ట్రాఫిక్ సిబ్బంది తమ పరిధిలోని దుకాణాలు, బార్లు నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవు.

సీపీ హెల్ప్‌లైన్‌తో పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగింది:

నగరంలో ప్రజలతోపాటు సిబ్బందికి ఎవరికైనా పోలీస్ శాఖాపరంగా సహాయం కావాల్సి వచ్చినా, ఎక్కడైనా నేరం జరిగితే సమాచారం అందించేందుకు వీలుగా దేశంలోనే మొదటిసారిగా సీపీ హెల్ప్‌లైన్ పేరుతో ఫోన్ నంబర్ (7995095799) అందుబాటులోకి తేవడంతో పోలీస్ శాఖపై నమ్మకం పెరిగింది. ఎంతోమంది ఆ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలతోపాటు విలువైన సమాచారాన్ని నాకు అందజేస్తున్నారు. దీనివల్ల నగరంలో జరుగుతున్న ఘటనలు, నేరాలు, పోలీస్ శాఖ పనితీరుపై స్పెషల్‌బ్రాంచి కంటే ప్రజలే నాకు ప్రధాన వనరుగా తయారయ్యారు. ఆ నంబర్‌కు ఎవరైనా, ఏ సమయంలోనైనా ఫోన్ చేయొచ్చు. నేనే స్వయంగా స్పందించి సమస్యను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. ఇప్పటికే చాలా మంది ఫోన్ చేస్తున్నారు. ఇంతకుముందెన్నడూ వినని సమస్యలను తెలుసుకోగలుగుతున్నాను.

జీవీఎంసీతో కలిసి నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

నగరంలో ట్రాఫిక్ సమస్య ప్రధాన సమస్యగా మారింది. దీనిని అధిగమించేందుకు జీవీఎంసీతో కలిసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఇప్పటికే రద్దీ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాం. నగరంలోకి భారీ వాహనాలను నిర్ణీత వేళల్లోనే వచ్చేలా చర్యలు ప్రారంభించాం. సిబ్బంది కొరత నేపథ్యంలో ఏఆర్ నుంచి కొంతమందిని తీసుకుని ట్రాఫిక్‌కు అటాచ్‌మెంట్ చేశాం. గిరిప్రదక్షిణ రోజు ట్రాఫిక్ జామ్ జరిగింది. ఏటా జరిగే పండుగ కావడం, ఏటేటా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండడంతో భవిష్యత్తులో ట్రాఫిక్ జామ్ జరగకుండా ఉండాలంటే కొన్ని చర్యలు తీసుకోవాలని గుర్తించాం. దీనిపై జీవీఎంసీ, దేవాదాయశాఖ, జిల్లా కలెక్టర్‌తో సమావేశమై కొన్నిచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం, అండర్‌పాస్‌ల నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తాం. దీనివల్ల సాధారణ రోజుల్లో ట్రాఫిక్ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజలకు భద్రత కల్పించడంతోపాటు పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వబోతున్నాం. ఇకపై ప్రతి నెలా రిటైర్‌మెంట్ మేళాతోపాటు రివార్డు మేళా ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఉద్యోగ విరమణ చేసేవారికి ఆరోజు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి వదిలేస్తున్నాం. తర్వాత వారికి రావాల్సిన ప్రయోజనాల కోసం ప్రభుత్వం చుట్టూ ఏళ్లపాటు తిరుగుతున్నారు. అలాకాకుండా ఇకపై ఉద్యోగ విరమణ చేసేవారికి వచ్చే ప్రయోజనాలను ఆదేరోజు అందజేయాలని నిర్ణయించాం. దీంతోపాటు కానిస్టేబుళ్లు, హోంగార్డులకు భద్రత, రుణాలు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, డెత్ బెనిఫిట్స్ వంటివి సకాలంలో పొందేందుకు వీలుగా ఇకపై ఒక లైజనింగ్ ఆఫీసర్‌ను నియమిస్తాం. ఒక హోంగార్డును సహాయకుడిగా ఇస్తాం. వారే బెనిఫిట్స్ సిబ్బందికి సకాలంలో వచ్చేలా ప్రభుత్వంలో సమన్వయం చేసుకుంటారు. అలాగే ప్రతి నెలా రివార్డు మేళా పేరుతో ఆ నెలలో ఛేదించిన కేసుల్లో ప్రతిభ చూపేవారికి రివార్డులు అందజేస్తాం. దీనివల్ల వారిలో ఉత్సాహం పెరిగి మరింత కష్టపడి పని చేయడంతోపాటు మిగిలినవారు స్ఫూర్తిగా తీసుకుని పనిచేసేందుకు వీలుంటుంది.

జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమైన, అవసరమైన ఫైళ్లను కార్యాలయంలోనే భద్రపరిచి, మిగిలిన ఫైళ్లను జోన్-4 కార్యాలయానికి తరలించి కారిడార్‌ను ఖాళీ చేయాలని సూచించారు. కార్యాలయంలోకి గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది పనిచేసేందుకు అవసరమైన వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ప్రధాన కార్యాలయంలోని ఖాళీ ప్రదేశాల్లో మంచి నీడను ఇచ్చే మొక్కలను నాటాలని హార్టికల్చర్ డీడీ దామోదర్‌కు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు కల్పించడంతోపాటు, వారి సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర సమాచారాన్ని నగర ప్రజలకు తక్షణం చేరవేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరిపాలన, యూసీడీ విభాగంతోపాటు అకౌంట్స్, ఐటీ విభాగాలను కమిషనర్ పరిశీలించారు. తాను మరోసారి తనిఖీ చేస్తానని అప్పటికి పరిస్థితులన్నీ మెరుగుపడాల్సిందేనని స్పష్టంచేశారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్‌వర్మ, ఎస్ఈలు, వేణుగోపాల్, వినయ్‌కుమార్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో తనిఖీలు

సీతమ్మధార, జూలై 24: సీతమ్మధార రైతుబజారులో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్‌కే యాసీన్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సబ్సిడీ టమాటా స్టాల్‌ను పరిశీలించారు. అలాగే, ఆఫీసు రికార్డులు తనిఖీ చేశారు.

సాయిరాం నగర్‌లో సమస్యలు తిష్ఠ

- అధ్వానంగా తయారైన రోడ్లు
- భారీ వాహనాల రాకపోకలతో మరిన్ని అగచాట్లు
- కాలువలు శిథిలమవ్వడంతో రహదారులపైకి వస్తున్న మురుగు నీరు
- పందుల స్వైరవిహారం, తీవ్ర దుర్వాసనతో సతమతం
- అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు వేడుకోలు





గోతులమయమైన సాయిరాం నగర్ రోడ్డు

కూర్మన్నపాలెం, జూలై 24: జీవీఎంసీ 86వ వార్డు పరిధి సాయిరాంనగర్‌లో సమస్యలు తిష్ఠ వేశారు. ఈ కాలనీలో రహదారులో అధ్వానంగా మారడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం, పందుల సంచారం, దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్ల గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో నానాపాట్లు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాలనీలో రహదారులన్నీ అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇక్కడ రహదారి ఆధునీకరణ పనులు జరగకపోవడంతో పాటు అగనంపూడి నుంచి ఈ కాలనీ గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు మరింత ఛిద్రంగా మారుతుందని చెబుతున్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. ఈ రహదారి గుండా భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలన్న ఉద్దేశంతో సాయిరాంనగర్ వాసులు కాలనీకి అనుకుని గడ్డరును ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే దీని ఏర్పాటుకు కొంతమంది అడ్డుకట్ట వేయడంతో ఆ పనులు అటకెక్కాయి. గడ్డరును ఏర్పాటు చేయకపోవడంతో వల్ల యథేచ్ఛగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అందువల్ల ట్రాఫిక్ పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ గడ్డరు నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



మురుగు నీటితో నిండిన కాలువ

శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలు

సాయిరాంనగర్‌లో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగు నీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో పాటు రహదారుల పైకి చేరుతుండడంతో పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారవ్వడంతో పాటు తీవ్ర దుర్గంధంతో సతమతం అవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పందుల సంచారం అధికంగా ఉందని స్థానికులు చెబుతున్నారు కాలువల్లోని చెత్తాచెదారాన్ని పందులు చిందరవందర చేస్తున్నాయని పేర్కొంటున్నారు. మరోపక్క దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాయిరాంనగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలి

-వేగుంట శ్రీనివాస్, కాలనీవాసి



సాయిరాంనగర్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నిషేధించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలి. కాలనీలో భారీ వాహనాల రాకపోకలు సాగించకుండా గడ్డర్ నిర్మించేందుకు అధికారులు అనుమతి ఇవ్వాలి, మురుగు కాలువలు, రోడ్లను ఆధునీకరించడంతో పాటు పందుల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.



కాలనీలో గుంపుగా సంచరిస్తున్న పందులు



తనతో పాటు పిల్లలిద్దరికీ హెల్మెట్లు ధరింపజేసి ద్విచక్రవాహనంపై పాఠశాలకు తీసుకువెళుతున్న ఓ తల్లి

హెల్మెట్ ధారణలో స్ఫూర్తిదాయకం ఆ మహిళ..

కూర్మన్నపాలెం, జూలై 24: రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో ఓ మహిళ ద్విచక్ర వాహనం నడుపుతూ తాను హెల్మెట్ ధరించడమే కాకుండా బైక్ వెనుక తమ ఇద్దరి పిల్లలకు కూడా హెల్మెట్లు పెట్టి కూర్చోబెట్టడం అందరినీ ఆకట్టుకుంది. హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ పోలీసులు తరచూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుండడం పట్ల ఆమె ఆకర్షితురాలైంది. దీంతో ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు శిరస్త్రాణం ధరించడమే కాకుండా తమ పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి, వచ్చేటప్పుడు కూడా వారికి కూడా హెల్మెట్లు పెడుతున్నట్టు పేర్కొంది. హెల్మెట్ ధారణపై తాము చేస్తున్న అవగాహన కార్యక్రమాలకు మహిళల్లోనూ చైతన్యం వస్తుందనడానికి ఇదే నిదర్శనమని దువ్వాడ ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

బడ్జెట్ కేటాయింపుల పట్ల హర్షం

అగనంపూడి, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి న్యాయం చేయడం పట్ల తెలుగు మహిళ 79వ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో ఏపీ అభివృద్ధి చెందడం ఖాయమన్నారు.

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 54, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 28, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 35, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 85, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 30, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ 56, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పారిశ్రామిక ప్రాంతంలో త్వరలో వైసీపీ ఖాళీ?

టీడీపీ లేదా జనసేనలో చేరేందుకు సిద్ధమవుతున్న వైసీపీ కార్పొరేటర్లు!

ఎమ్మెల్యే గణబాబు రాక కోసం నిరీక్షణ

మల్కాపురం, జూలై 24: పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతంలో నాలుగైదు రోజుల్లో వైసీపీ ఖాళీ కానున్నట్టు తెలుస్తోంది. ఈ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన ఆడారి ఆనంద్‌కుమార్ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ కూడా దూరంగా ఉండడంతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని భావించిన పలువురు కార్పొరేటర్లు ఆ పార్టీని వీడేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 40, 58, 59, 61, 62 వార్డులకు చెందిన వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ లేదా జనసేనలో చేరేందుకు దాదాపు రంగం సిద్ధం చేసినట్టు ప్రచారం సాగుతోంది. అయితే 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్‌ను ఇటు టీడీపీ, అటు జనసేన పార్టీలో చేర్చుకునేందుకు ఎవరూ అంగీకరించడం లేదని విశ్వసనీయవర్గాల భోగట్టా. ప్రస్తుతం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అసెంబ్లీ సమావేశాలలో పాల్గొంటున్నందున ఆయన రాకకోసం వైసీపీ కార్పొరేటర్లు ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేశ్ తమ అనుచరులతో రెండు రోజుల క్రితం సమావేశమై పార్టీ మారే అంశంపై చర్చించినట్టు సమాచారం.

కేంద్ర బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంటుకు మొండిచేయి

'ఉక్కు'కు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కూర్మన్నపాలెం, జూలై 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంటుకు మొండిచేయి చూపిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,259వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో స్టీల్ ప్లాంటుకు న్యాయం జరుగుతుందని ఉద్యోగ, కార్మిక సంఘాలతో పాటు కార్మికులంతా ఎదురుచూశారని, అయితే వారి ఆశలన్నీ అడియాశలు అయ్యాయన్నారు. పూర్తి సామర్థ్యంతో ఉక్కు కర్మాగారాన్ని నడిపేందుకు రూ.ఐదు వేల కోట్లు ఇవ్వాలని కోరారు. సొంత గనులు కేటాయించాలని ఇటీవల స్టీల్‌ప్లాంటుకు విచ్చేసిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి వివరించామన్నారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ పెద్దలు ప్రభుత్వ రంగాల పట్ల తన పాత విధానాలనే అవలంబిస్తున్నారని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని, లేదా సెయిల్‌లో విలీనం చేస్తామన్న ప్రకటన వచ్చేంత వరకు తాము పోరాటాలను కొనసాగిస్తామని నరసింగరావు స్పష్టం చేశారు. సీఐటీయూ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఇటీవల ఇక్కడకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్లాంట్ సమస్యలపై చక్కని ప్రణాళికను రూపొందించేందుకు, పరిస్థితిని చక్కదిద్దేందుకు 45 రోజుల సమయం పడుతుందని అన్నారని, ఆయన ఏ విధంగా కర్మాగారానికి న్యాయం చేస్తారోనని అందరం ఎదురు చూస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర మంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, ఎస్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరాజు, నరేంద్ర, కేవీ ప్రసాద్, పలువురు సీఐటీయూ కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల చొరవతో ముంపు సమస్యకు పరిష్కారం

పెందుర్తి, జూలై 24: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 96వ వార్డు పరిధి దొగ్గవానిపాలెం కాలనీ నీటి ముంపునకు గురైంది. పలు ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కొంతమంది ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు వాట్సాప్ ద్వారా సమస్యను వివరించారు. అందుకు ఆయన స్పందించి జోనల్-8 అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జెడ్సీ హైమావతి దొగ్గవానిపాలెం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో డ్రైనేజీలోని పూడికను తొలగించి నీటి ప్రవాహానికి అవరోధం లేకుండా చేశారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



దొగ్గవానిపాలెంలో పూడికల తొలగింపును పర్యవేక్షిస్తున్న జెడ్సీ

చెరువును పరిశీలించిన కార్పొరేటర్

వేపగుంట: జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురం సర్వే నంబరు 1333/1లో ఉన్న ఆరు ఎకరాల విస్తీర్ణంలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటు తదితర అభివృద్ధి నిర్మాణ పనులకు కార్పొరేటర్ రాపర్తి కన్నా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అధికారులతో బుధవారం చెరువు పరిసరాలను పరిశీలించి ఇక్కడ వాకింగ్ ట్రాక్, ఇతర సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. గతంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుపై గతంలో నిర్ణయం తీసుకున్నా కొన్ని కారణాలు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఈ పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రత్నాకర్ రెడ్డి, సర్వేయర్ అప్పన్న, టీపీఓ తేజ, టీడీపీ నాయకులు గంగ వరహాలు, నూకరాజు, వెంకట్, బుజ్జి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కొణతాల లక్ష్మీనారాయణ, 'బ్రహ్మకుమారీస్' ప్రతినిధులు

ఘనంగా బ్రహ్మకుమారీస్ శాఖ వార్షికోత్సవం

అగనంపూడి, జూలై 24: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ 11వ వార్షికోత్సవాన్ని ఇక్కడి బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బ్రహ్మకుమారీస్ సంస్థ చేపడుతున్న సేవలను కొనియాడారు. అనంతరం అఖండ యోగా బట్టీని నిర్వహించారు. సంస్థ ముంబై ప్రతినిధి బీకే గణేశ్‌బాయిజీ తమ సంస్థ చేపడుతున్న ఆధ్యాత్మిక సేవలను వివరించారు. మధ్యాహ్నం బ్రహ్మ భోజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్, సంస్థ ప్రతినిధులు బీకే వేణి, సోమేశ్వరి, రామకోటి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జూలై 24: కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును మంగళవారం ఢిల్లీలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్, విశాఖ విమానాశ్రయ సలహా కమిటీ సభ్యుడు కరణంరెడ్డి నరసింగరావు కలిశారు. విశాఖ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి మరింత కృషి చేయాలని మంత్రిని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బీజేపీ నాయకులు బొత్స దిలీప్, అశోక్‌రాజు ఉన్నారు.



రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు

మల్కాపురం, జూలై 24: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కార్పొరేటర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వార్డుల్లో సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి సహకరించాలని కోరారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే వార్డుల్లో పర్యటించి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో 40, 58, 60, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ తండ్రి దాడి సత్యనారాయణ, గులిగిందల కృష్ణ, 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ భర్త సురేష్ ఉన్నారు.

68వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 68వ వార్డులో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్పొరేటర్ గుడివాడ అనూష విన్నవించారు. నూతన కమిషనర్‌ను ఆమెతో పాటు వైసీపీ నగర ప్రధాన కార్యదర్శి గుడివాడ లతీశ్ కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులోని సమస్యలను ఆయనకు వివరించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఆటోనగర్, జూలై 24: ఎల్‌వీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఎల్‌వీ నగర్, తోకాడ, కుంచుమాంబ కాలనీ, ఆటోనగర్ బీ-బ్లాక్ ఇండస్ట్రియల్ ఏరియాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు.

కొండయ్యవలసలో జనసేన సభ్యత్వ నమోదు

అగనంపూడి, జూలై 24: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి కొండయ్యవలస మినీ జగదాంబ జంక్షన్‌లో గల జనసేన పార్టీ కార్యాలయంలో నాలుగో విడత సభ్యత్వ నమోదును బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం అందించే బీమాను జనసైనికులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో విరిగిగా సభ్యత్వాలు నమోదు చేయాలని, జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. జనసైనికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సభ్యత్వం పొందేవారికి రూ.ఐదు లక్షల బీమాను కల్పించిందన్నారు. నాయకులు పి.వసంతరావు, రామకృష్ణ, ఎం.కిరణ్, నూరి బాబు, ఎన్.రాజు, సన్నీ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన పీలా శ్రీనివాసరావు

శివారు ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించాలి

జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, జూలై 24: నగర శివారు ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించాలని జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరాంధ్ర శబరిమలై అయ్యప్ప సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం పెందుర్తిలో ఏర్పాటు చేసిన ఫ్రీ స్క్రీనింగ్ కేన్సర్ టెస్ట్, నేత్ర వైద్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో సుమారు వందమంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. అయ్యప్ప సేవా ట్రస్టు ప్రతినిధులు సమకూర్చిన కళ్లద్దాలను పలువురికి పీలా శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వేగి పరమేశ్వరరావు, శరగడం బుజ్జి, గురుస్వామి రామస్వామి, శరగడం శంకరరావు, ఆళ్ల సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: గాజువాక ఎంఈవో సునీత

పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాల నిర్వహణ



ఆటల పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈవో, తదితరులు

అక్కిరెడ్డిపాలెం, జూలై 24: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలోనూ రాణించాలని గాజువాక మండల విద్యాశాఖాధికారి సునీత అన్నారు. జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు పలు ఆటల పోటీలను నిర్వహించారు. ఆయా పోటీలను దగ్గరుండి ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, మహ్మద్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: కేంద్రం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని గోపాలపట్నం పరిసర ప్రాంతంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. పాఠశాలల్లో కబడ్డీ, చదరంగం, క్యారమ్స్ కుస్తీ, అష్టాచెమ్మా, తదితర సంప్రదాయ ఆటలను పిల్లతో ఉపాధ్యాయులు ఆడించారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 87వ వార్డు కణితి హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించామన్నారు. సంప్రదాయ క్రీడలైన కర్రా బిళ్ల, చదరంగం, ఏడు పెంకులాట, తొక్కుడుబిళ్ల, గోలీల ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎం.మన్నాజీ, నారాయణరావు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: వేపగుంట ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కిప్పింగ్, తొక్కుడు బిల్ల, ఖోఖో, మ్యూజికల్ ఛైర్ తదితర క్రీడలను ఆడించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష ఏఎంవో జి.లక్ష్మి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. విజేతలకు బహుమతులును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్. జగన్నాథరావు, క్లస్టర్ సీఆర్‌పీ సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నేత 'అయ్యంకి'కి నివాళి

పెదగంట్యాడ, జూలై 24: గ్రంథాలయాల ఏర్పాటు కోసం ఉద్యమం నడిపిన వారిలో దివంగత అయ్యంకి వెంకటరమణయ్య ఒకరని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి జయంతిని పురస్కరించుకుని ఇక్కడి గ్రంథాలయంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ గ్రంథాలయాల వల్ల విజ్ఞానం అందరికీ పెంపొందుతుందన్నారు. చదువుకునే యువతతో పాటు నిరుద్యోగులు లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రంథాలయోద్యమ కర్త దివంగత అయ్యంకి వెంకట రమణయ్య ఆదర్శనీయులని ప్రముఖ కవి కె.సత్తిరాజు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో అయ్యంకి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ రంగానికి, పత్రిక రంగానికి ఎన్నలేని సేవలు అందించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికార అనసూయదేవీ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సెయింట్ ఆన్స్ గ్రంథాలయాధికారి శిరీష, మల్కాపురం గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సత్తిరాజును సన్మానించారు.

ఏషియన్ కరాటే పోటీలో విశాఖ కోచ్‌లు ప్రతిభ

గాజువాక, జూలై 24: బూటాన్‌లో ఈ నెల 15 నుంచి 22 వరకు జరిగిన ఎనిమిదో సౌత్ ఏషియన్ కరాటే చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన ఐదుగురు కోచ్‌లు పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి న్యాయ నిర్ణేతల ప్రశంసలు అందుకున్నారు. వారికి దక్షిణాసియా ప్రెసిడెంట్ భరత్‌శర్మ ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. వీరిలో కోచల్ కేపీ రాజు, కోరాడ సుమన్, డి.ప్రవీణ్, కె.ప్రసాద్‌కుమార్, మురళీకృష్ణలు ఉన్నారు. ఏషియన్ పోటీల్లో భారతదేశ ఖ్యాతిని చాటిన కోచ్‌లను పలువురు అభినందించారు.



నగరానికి చెందిన కోచ్‌లు

క్రీడల్లో ప్రతిభ చూపే వారికి మంచి గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం, జూలై 24: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపేవారికి సమాజంలో మంచి గుర్తింపుతో పాటు మంచి ఉపాధి లభిస్తుందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు అన్నారు. స్పోర్ట్స్ కోటాలో భెల్ హెచ్‌పీవీపీలో ఉద్యోగం సాధించి బుధవారం పదవీ విరమణ చేసిన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఉరుకూటి బాబురావును జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులు పల్లా రమణ, ఉరుకూటి కనకరాజు, వి.రాజు, నీలకంఠం, మొల్లి శ్రీను, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో ఆధార్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

కూర్మన్నపాలెం, జూలై 24: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారంతా తమ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. అలాగే ఇంటి చిరునామా, వయస్సు, పేరు మార్పు, కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవాలన్నా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న స్మారక భవనానికి స్థలం కేటాయించాలి

పెదగంట్యాడ, జూలై 24: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న స్మారక భవనం ఏర్పాటుకు పారిశ్రామిక ప్రాంతంలో రెండువేల చదరపు గజాల స్థలాన్ని కేటాయించవలసిందిగా రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి సత్యప్రసాద్‌ను పారిశ్రామిక ప్రాంత గీత సహ కులాల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు, గౌరవ అధ్యక్షుడు నెల్లి సాధూరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు పితాని భాస్కరరావులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన గౌతు లచ్చన్న పేరిట స్మారక భవనాన్ని నిర్మించడం ఎంతో సముచితంగా ఉంటుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు గోవింద్ గౌడ్, మంగరాజు ఉన్నారు.

విస్తృత తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సెబ్ పోలీసులు

సీతమ్మధార, జూలై 24: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ టీవీఏ నాయుడు, సెబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజుల నాయుడు, ఎస్సైలు వి.వేణుగోపాల్, జి.దాస్, సిబ్బంది రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణా అడ్డుకట్టకు చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరు ఖరారుపై హర్షం

జగదాంబ కూడలి, జూలై 24: తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారాకరామారావు పేరును వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఖరారు చేస్తూ అసెంబ్లీలో సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడంపై అన్న ఎన్టీఆర్ సేవా సమితి నగర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం జగదాంబ దరిలోని సంస్థ కార్యాలయంలో ప్రతినిధులు వేగి రాధాకృష్ణ, యల్లా సత్యనారాయణ, డి.సత్యనారాయణ, దుక్కల మూర్తి, కె.శ్రీనివాసరావు, డి. యోగి, గోవింద్, ప్రకాశ్, అప్పలరాజు, ఎన్టీఆర్ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలపై కూటమి ప్రభుత్వం సత్వర చర్యలకు దిగడం అభినందనీయమన్నారు.



ఉడాకాలనీలో గ్యాస్ గొడౌన్ దారిలో రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాలు



ఆర్టీవీ కార్యాలయం మార్గంలో రోడ్డు ఆక్రమణ

ప్లాన్‌లో ఒకలా.. నిర్మాణం వేరొకలా..!

- బిల్డర్ల ఇష్టారాజ్యం
- ఉత్తర నియోజవర్గ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- సచివాలయ కార్యదర్శులు వత్తాసు

మురళీనగర్, జూలై 24; విశాఖ ఉత్తర నియోజవర్గంలోని బిల్డర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. అయినా, జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ కొరవడుతుండడంపై తీవ్ర విమర్శలు తలెత్తున్నాయి. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణాల పరిశీలనకు వార్డుల్లో ఉండే చైన్‌మన్‌లను తొలగించి పూర్తి అధికారాలు వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించింది. దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. దీంతో వార్డుల్లో నిర్మాణాల్లో దర్జాగా ప్లానింగ్ సెక్రటరీలు, స్థానిక ప్రజాప్రతినిధులు బిల్డర్ల నుంచి యధేచ్ఛగా మామూళ్లు వసూలు చేస్తూ.. నిబంధనలను తుంగలో తొక్కుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 51వవార్డు మాధవధార ఉడాకాలనీలో జోరుగా సాగుతున్న నిర్మాణాలపై కనీసం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు దృష్టి సారించడం లేదు. దీంతో పరదాలచాటున నిర్మాణాలు సాగిపోతున్నాయి. ప్లాన్ మంజూరైన తర్వాత అటు వైపు చూడటం లేదు. జోన్-5లో ఓ బిల్డింగ్ ఇన్‌స్పెక్టరు దిశానిర్దేశంలో కొత్త సచివాలయ సిబ్బంది ఈ అక్రమాల్లో ముందుసాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నారు. బిల్డర్లు ప్లానులో చూపేది ఒకటి.. వాస్తవంగా క్షేత్రస్థాయిలో మరోలా ఉన్నా చర్యలు తీసుకోవడంలేదని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కళింగనగర్ సచివాలయం 291 పరిధిలో ఓ బహుళ అంతస్థును నిబంధనలు అతిక్రమించి కట్టారు. దీంతో ఆ బిల్డరు ఆ ప్లాను ఇచ్చిన సెక్రటరీ జరిమానాతోపాటు, తన వద్ద నుంచి అనధికారికంగా సొమ్ము గుంజినట్టు ఆయన ఫిర్యాదు చేస్తున్నారు. ఇక, సచివాలయ సిబ్బంది అండదండలున్న బిల్డర్లు యధేచ్ఛగా గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. రోడ్లను ఆక్రమించి తమ భవనాల ఎదుట ప్రత్యేక ఆర్చ్‌లు, పచ్చదనం పేరిట పార్కింగ్ స్థలాల్ని దాటి, తమ సెట్‌బ్యాక్ స్థలాన్ని వదలకుండా నిర్మాణాలు చేస్తున్నారు. కాలువలను కప్పేసి కుండీలు కడుతున్నారు. వారి అదనపు పార్కింగ్‌కి రోడ్డుని వాడుకుని కట్టడాలు చేప డుతున్నారు. దీంతో ఆర్టీఏ కార్యాలయం వద్ద నిత్యం రద్దీగా ఉండే దారిలో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి.

అన్నదానానికి నిత్యావసరాలు వితరణ

పూర్ణామార్కెట్, జూలై 24: టౌన్ కొత్తరోడ్డు శ్రీ జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న మహా అన్నదాన కార్యక్రమానికి వెంకటేశ్వర ట్రస్ట్ అధినేత వాకాడ రాధ రూ.50వేల విలువైన బియ్యం, కిరాణా సరకులను 29 వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు చేతుల మీదుగా బుధవారం ఈవో టి. రాజగోపాలరెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర హాస్పిటల్స్ అధినేత వి.వి. రావు, పెదసాయి, టీడీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



పార్టీలో చేరిన మహిళలతో ఉత్తరం జనసేన కన్వీనర్ ఉషాకిరణ్

మద్రిపాలెం, జూలై 24: గ్రేటర్ 54వ వార్డు మద్రిపాలెం మహరాణివీధిలోని పలువురు మహిళలు బుధవారం ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారరు. ఈసందర్భంగా వారికి ఉషాకిరణ్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో కృషికి ఆకర్షితులై తమ పార్టీలో చేరేందుకు ఎంతో మంది ముందుకు వస్తున్నారన్నారు. పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 53, 54 వార్డుల పార్టీ ఇన్‌చార్జి నీరు కొండ దివాకర్, 54వ వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్, సభ్యులు పాండ్రంకి దివాకర్, కడిమి సీతారాం, దొగ్గా సురేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమష్టిగా పర్యావరణ పరిరక్షణ



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

జ్ఞానాపురం, జూలై 24: కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆదేశాలమేరకు బుధవారం స్థానిక సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రొగ్రాం అధికారి కె.మాణిక్య కుమారి, బోటనీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. నాగరాజు, డాక్టర్ ఎం.పద్మ సుందరి, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్ది



వినాయకుడు

అక్కయ్యపాలెం, జూలై 24: పోర్టు ఆస్పత్రి ఎదురుగా ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్ధి పూజ బుధవారం రాత్రి అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్య శర్మ, కేవీ రమణ, గురుపాద సేవా సమితి సభ్యులు పాలల్గొన్నారు.

కథానికలు సమాజానికి దర్పణం

సీతమ్మధార, జూలై 24 : సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజం కాలేజీలో కథా కచేరీ నిర్వహించారు. వైవిధ్యభరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఔత్సాహిక రచయితలు ఏమి చెప్పాలన్న అంశంతోపాటు ఎలా చెప్పాలన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. భావంతో పాటు శిల్పానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యదర్శి సీహెచ్ సూర్యనారాయణ బలివాడ కాంతారావు అడ్డదారి కథ చదివి విశ్లేషించారు. సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు కథలు, ఇతర సాహిత్య ప్రక్రియల ద్వారా సామాజిక స్థితులను తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, భాగవతుల సత్యనారాయణమూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, పీవీఆర్ కుమార్‌రావు, పరమేశ్వరరావు, బి.రాధారాణి, సురేష్, డీఎస్ కుమార్, వీకే శర్మ పాల్గొన్నారు.

కొండవాలు గ్రామాలకు రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కంచరపాలెం, జూలై 24: జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాలైన పంచగ్రామాలకు రోడ్డు పనులను కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు బుధవారం ప్రారంభించారు. రోడ్డు లేక పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జీవిఎంసీ కౌన్సెల్‌లో నిధులను మంజూరయ్యేటట్టు కృషిచేశారు.ఈ నేపథ్యంలో పనులను ప్రారంభించారు.వీలైనంత త్వరలో నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలి

అల్లిపురం, జూలై 24: గ్రేటర్ 32వ వార్డు అల్లిపురం ప్రాంతంలోని నేరెళ్ల కోనేరు, పండావీధి, చలువతోటల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని జనసేన నాయకలు, కార్పోరేటర్ కందుల నాగరాజు కోరారు. బుధవారం నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చీని కలసి వినతి పత్రం అందజేశారు.గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి యువత చెడిపోతున్నారని తెలిపారు. నేరాలకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలోవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌నుకలిసిన టీడీపీ నేత

అల్లిపురం: వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎస్ విశ్వనాధన్‌ను తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట దేవాలయ భూముల విషయంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ ఎస్ ఎన్ గుప్తా పాల్గొన్నారు.

జీవీఎం కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

పూర్ణామార్కెట్: గ్రేటర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించని సంపత్ కుమార్‌ను 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులో పరిధిలో కాలుష్యం, పారిశుద్ధ్యం తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కంచరపాలెం: జీవిఎంసీ కమిషనర్‌గా బాధ్యతులు చేపట్టిన పి.సంపత్‌కుమార్‌ను 55వార్డు టీడీపీ నాయకురాలు, తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. నగరాభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వార్డు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎల్ఎఫ్ ఆర్పీల సమావేశం

అక్కయ్యపాలెం, జూలై 24 : గ్రేటర్ 46వ వార్డు కైలాసపురంలో టీఎల్ఎఫ్ ఆర్పీల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక హాజరయ్యారు.

ఆటో డ్రైవర్లు సమష్టిగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార, జూలై 24 : డ్రైవర్లంతా ఐక్యంగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ అన్నారు. స్థానిక ఏఎస్ఆర్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం జరిగిన శ్రీ దుర్గా గణపతి ఆటో స్టాండ్ డ్రైవర్ల ససమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. డ్రైవర్లు ఖాకీ యూనిఫాం ధరించాలని, ఆటోల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పక్కాగా ఉండాలన్నారు. ఆటోలో పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించరాదని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. నగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాల కోసం, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుకు (పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు చంటి, నాని, రవీందర్ రెడడ్డి, గణేష్, రాజ్‌కుమార్, నాయుడు, సన్నీ, డీజే, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి సేవలు చిరస్మరణీయం



అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

జగదాంబ కూడలి, జూలై 24: గ్రంథాలయోద్యమకారుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణ్య 134 జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ఉద్యోగులు, ఉపగ్రంథాలయ అధికారి ఎల్.రాజేంద్ర వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అయ్యంకి వెంకటరమణ్య గ్రంథాలయాల స్థాపనకోసం చేసిన సేవలను, ఉద్యమాలను మననం చేసుకున్నారు. పాఠకులు, విద్యార్థులకు మిఠాయిలను పంచారు.

ఆర్డీ కార్యాలయాన్ని గాడిలో పెడతా

... 5వ పేజీ తరువాయి

సూపరింటెండెంట్లుగా 12 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించామన్నారు. నర్సింగ్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ట్యూటర్ గ్రేడ్-1 పోస్టుకు కొద్దిరోజుల్లో ప్రమోషన్ కల్పించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీహెచ్ఈవో), పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్) నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)గా పదోన్నతులు కల్పించేందుకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సిద్ధమవుతోందన్నారు. ఈ మేరకు జోన్-1 పరిధిలో పదోన్నతులకు సంబంధించి 40 వరకు ఖాళీలున్నట్టు గుర్తించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సమాచారాన్ని అందించా మన్నారు. ఆయా కేడర్లలో పదోన్నతులు పొందేందుకు అర్హులైన సీనియర్ జాబితాను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని పాటించాలని ఆదేశించినట్టు వెల్లడించారు.

గంజాయి నియంత్రణ, మహిళలకు రక్షణ..

... 5వ పేజీ తరువాయి

ఆధిపత్యం కోసం, సుపారీ కోసం హత్యలకు, దాడులకు సైతం తెగబడుతున్నారు. ఇలాంటి వారికి ముకుతాడు వేసేందుకు చర్యలు ప్రారంభించాం. తరచూ నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లను జనజీవన స్రవంతిలో ఉండకుండా చేసేందుకు వీలుగా వారిపై ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సిబ్బందిని ఇప్పటికే ఆదేశించాం. వచ్చే నెలాఖరు నాటికి కేసులు దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం ద్వారా వారికి శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం. కొంత మంది రౌడీషీటర్లు వెనకుండి చీటీల వ్యాపారం చేయిస్తున్నారని తెలిసింది. నగరంలో పోలీస్ స్టేషన్‌ల వారీగా చీటీ వ్యాపారాలకు సంబంధించిన జాబితా తయారుచేయాలని ఆదేశించాం. ఇప్పటికిప్పుడు చీటీల వ్యాపారం ఆపేసి చీటీలు కట్టివారికి ఎంతకట్టారో అంతమొత్తం లెక్కించి తిరిగి ఇచ్చేయాలని ఆదేశించాం. ఇంకా ఎక్కడైనా చీటీల వ్యాపారం జరిగితే చర్యలకు గురికావాల్సి ఉంటుంది.

భూకబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ షీట్

నగరంలో భూకబ్జాలు, భూవివాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. గతంలో భూవివాదాలు, కబ్జాలకు సంబంధించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాటిని సివిల్ కేసులంటూ తీసుకునేందుకు నిరాకరించేవారు. కానీ భూకబ్జాలకు పాల్పడేవారు ముందుగా డాక్యుమెంట్లను డూప్లికేట్ చేయడం, సంతకాలను ఫోర్జరీ చేయడం చేస్తున్నారు. కాబట్టి వాటిని క్రిమినల్ కేసులుగానే గుర్తించాల్సి ఉంటుంది. అలాంటి వాటిపై ఇక నుంచి కేసులు నమోదుచేయాలని సీఐలను ఆదేశించా. భూకబ్జాలకు పాల్పడే వారిలో భయం పెరిగేందుకు వారిపై కూడా రౌడీషీటర్ల మాదిరిగానే ల్యాండ్‌గ్రాబింగ్ షీట్ ఓపెన్ చేస్తాం. వారి ఫొటోలు, వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శించాలని నిర్ణయించాం. దీనివల్ల భూకబ్జాలు, ఆక్రమణలకు పాల్పడాలంటే కొందరిలోనైనా భయంపడుతుంది.

తరచూ నేరాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ

మహిళలపై వేధింపులు, దాడులు జరుగుతున్న ప్రాంతాలు, గంజాయి వినియోగించే ప్రాంతాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. అలాంటి ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ద్విచక్ర వాహనంపై రక్షక్ బృందాలు తిరిగేలా చర్యలు తీసుకున్నాం. వీరంతా రాత్రి 12 గంటలు నుంచి తెల్లవారుజామున ఆరు గంటల వరకూ తమకు కేటాయించిన ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తారు. అలాగే నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు, పొదలు తొలగింపు, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఇప్పటికే సీసీ కెమెరాలు ఉండి పనిచేయకపోతే వాటిని రిపేరు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

అన్ని కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చర్యలు

నమోదుచేసిన అన్ని కేసుల్లోనూ నిందితులకు శిక్షపడేలా చర్యలు ప్రారంభించాం. కోర్టులో వీగిపోయే కేసులపై ప్రతి నెలా క్రైమ్ మీటింగ్ రోజున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేసు ఎందుకు వీగిపోయిందనేది సమీక్షిస్తాం. ఆ సమావేశానికి దర్యాప్తు అధికారులతోపాటు కోర్టులో పోలీసుల తరపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కూడా పిలుస్తాం. దీనివల్ల కేసు దర్యాప్తులో ఎక్కడ లోపం జరిగిందనేది తెలుసుకుని తర్వాత అలాంటి పొరపాటు జరగకుండా చేయవచ్చు. అలాగే కేసు ఒకవేళ వీగిపోయినా వెంటనే హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లేలా దర్యాప్తు అధికారులు, పీపీల మధ్య సమన్వయం ఏర్పడుతంది. వచ్చే నెల క్రైమ్ మీటింగ్ నుంచే దీనికి శ్రీకారం చుట్టబోతున్నాం.

పాస్‌పోర్టు వెరిఫికేషన్ మూడు రోజుల్లో పూర్తిచేయాల్సిందే

నగరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. వెరిఫికేషన్‌కు వెళ్లే సిబ్బంది డబ్బులు ఇవ్వకపోతే వెరిఫికేషన్‌ను పెండింగ్‌లో ఉంచేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు వీలుగా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌కు సంబంధించి ప్రతి కానిస్టేబుల్ ప్రతి రోజూ ఎన్నిపెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని పూర్తిచేమనే దానిపై డీఎస్ఆర్ ఇవ్వాలి. కానిస్టేబుల్ చేతికి వెరిఫికేషన్ ఫైల్ వస్తే దానిపై మూడు రోజుల్లోగా ఏదో నివేదిక అందజేయాల్సిందే. అలాకాకుండా పెండింగ్‌లో ఉంచితే మాత్రం అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అవినీతి పోలీసులపై త్వరలోనే చర్యలు

పోలీస్ శాఖలో పనిచేస్తున్న కొంతమంది అవినీతికి సంబంధించి ఆధారాలతో నాకు ఫిర్యాదులు అందాయి. వీటిపై ఇప్పటికే అంతర్గతంగా విచారణ జరిపించాం. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే అలాంటి వారిపై చర్యలు ఉంటాయి. సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడినా, పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంలో విఫలమైనా, ఫిర్యాదుదారుల పట్ల దురుసుగా ప్రవర్తించినా చర్యలు తప్పవు. ఈ విషయం ఇప్పటికే అందరికీ స్పష్టంచేశాం. స్టేషన్లలో ఇప్పటికీ జనరల్ కానిస్టేబుళ్ల వ్యవస్థ నడుస్తోందని నా దృష్టికి వచ్చింది. అలాగే క్రైమ్, ట్రాఫిక్ సిబ్బంది తమ పరిధిలోని దుకాణాలు, బార్లు నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవు.

సీపీ హెల్ప్‌లైన్‌తో పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగింది:

నగరంలో ప్రజలతోపాటు సిబ్బందికి ఎవరికైనా పోలీస్ శాఖాపరంగా సహాయం కావాల్సి వచ్చినా, ఎక్కడైనా నేరం జరిగితే సమాచారం అందించేందుకు వీలుగా దేశంలోనే మొదటిసారిగా సీపీ హెల్ప్‌లైన్ పేరుతో ఫోన్ నంబర్ (7995095799) అందుబాటులోకి తేవడంతో పోలీస్ శాఖపై నమ్మకం పెరిగింది. ఎంతోమంది ఆ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలతోపాటు విలువైన సమాచారాన్ని నాకు అందజేస్తున్నారు. దీనివల్ల నగరంలో జరుగుతున్న ఘటనలు, నేరాలు, పోలీస్ శాఖ పనితీరుపై స్పెషల్‌బ్రాంచి కంటే ప్రజలే నాకు ప్రధాన వనరుగా తయారయ్యారు. ఆ నంబర్‌కు ఎవరైనా, ఏ సమయంలోనైనా ఫోన్ చేయొచ్చు. నేనే స్వయంగా స్పందించి సమస్యను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. ఇప్పటికే చాలా మంది ఫోన్ చేస్తున్నారు. ఇంతకుముందెన్నడూ వినని సమస్యలను తెలుసుకోగలుగుతున్నాను.

జీవీఎంసీతో కలిసి నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

నగరంలో ట్రాఫిక్ సమస్య ప్రధాన సమస్యగా మారింది. దీనిని అధిగమించేందుకు జీవీఎంసీతో కలిసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఇప్పటికే రద్దీ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాం. నగరంలోకి భారీ వాహనాలను నిర్దీత వేళల్లోనే వచ్చేలా చర్యలు ప్రారంభించాం. సిబ్బంది కొరత నేపథ్యంలో ఏఆర్ నుంచి కొంతమందిని తీసుకుని ట్రాఫిక్‌కు అటాచ్‌మెంట్ చేశాం. గిరిప్రదక్షిణ రోజు ట్రాఫిక్ జామ్ జరిగింది. ఏటా జరిగే పండుగ కావడం, ఏటేటా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండడంతో భవిష్యత్తులో ట్రాఫిక్ జామ్ జరగకుండా ఉండాలంటే కొన్ని చర్యలు తీసుకోవాలని గుర్తించాం. దీనిపై జీవీఎంసీ, దేవాదాయశాఖ, జిల్లా కలెక్టర్‌తో సమావేశమై కొన్నిచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం, అండర్‌పాస్‌ల నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తాం. దీనివల్ల సాధారణ రోజుల్లో ట్రాఫిక్ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజలకు భద్రత కల్పించడంతోపాటు పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వబోతున్నాం. ఇకపై ప్రతి నెలా రిటైర్‌మెంట్ మేళాతోపాటు రివార్డు మేళా ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఉద్యోగ విరమణ చేసేవారికి ఆరోజు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి వదిలేస్తున్నాం. తర్వాత వారికి రావాల్సిన ప్రయోజనాల కోసం ప్రభుత్వం చుట్టూ ఏళ్లపాటు తిరుగుతున్నారు. అలాకాకుండా ఇకపై ఉద్యోగ విరమణ చేసేవారికి వచ్చే ప్రయోజనాలను అదేరోజు అందజేయాలని నిర్ణయించాం. దీంతోపాటు కానిస్టేబుళ్లు, హోంగార్డులకు భద్రత, రుణాలు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, డెత్ బెనిఫిట్స్ వంటివి సకాలంలో పొందేందుకు వీలుగా ఇకపై ఒక లైజనింగ్ ఆఫీసర్‌ను నియమిస్తాం. ఒక హోంగార్డును సహాయకుడిగా ఇస్తాం. వారే బెనిఫిట్స్ సిబ్బందికి సకాలంలో వచ్చేలా ప్రభుత్వంలో సమన్వయం చేసుకుంటారు. అలాగే ప్రతి నెలా రివార్డు మేళా పేరుతో ఆ నెలలో ఛేదించిన కేసుల్లో ప్రతిభ చూపేవారికి రివార్డులు అందజేస్తాం. దీనివల్ల వారిలో ఉత్సాహం పెరిగి మరింత కష్టపడి పని చేయడంతోపాటు మిగిలినవారు స్ఫూర్తిగా తీసుకుని పనిచేసేందుకు వీలుంటుంది.

జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమైన, అవసరమైన ఫైళ్లను కార్యాలయంలోనే భద్రపరిచి, మిగిలిన ఫైళ్లను జోన్-4 కార్యాలయానికి తరలించి కారిడార్‌ను ఖాళీ చేయాలని సూచించారు. కార్యాలయంలోకి గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది పనిచేసేందుకు అవసరమైన వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ప్రధాన కార్యాలయంలోని ఖాళీ ప్రదేశాల్లో మంచి నీడను ఇచ్చే మొక్కలను నాటాలని హార్టికల్చర్ డీడీ దామోదర్‌కు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు కల్పించడంతోపాటు, వారి సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర సమాచారాన్ని నగర ప్రజలకు తక్షణం చేరవేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరిపాలన, యూసీడీ విభాగంతోపాటు అకౌంట్స్, ఐటీ విభాగాలను కమిషనర్ పరిశీలించారు. తాను మరోసారి తనిఖీ చేస్తానని అప్పటికి పరిస్థితులన్నీ మెరుగుపడాల్సిందేనని స్పష్టంచేశారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్‌వర్మ, ఎస్ఈలు, వేణుగోపాల్, వినయ్‌కుమార్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో తనిఖీలు

సీతమ్మధార, జూలై 24: సీతమ్మధార రైతుబజారులో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్కే యాసీన్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సబ్సిడీ టమాటా స్టాల్‌ను పరిశీలించారు. అలాగే, ఆఫీసు రికార్డులు తనిఖీ చేశారు.

సచివాలయాల్లో ప్రారంభం కాని ఆధార్ సేవలు

» కొత్త కార్డులు, సవరణల కోసం ప్రజల అవస్థలు
» సేవల కోసం పొరుగు జిల్లాలకు పరుగు

పద్మనాభం, జూలై 24 : మండలంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 16 సచివాలయాలు ఉండగా రెడ్డిపల్లి, పద్మనాభం, మద్ది సచివాలయాలకు ఆధార్ కేంద్రాలను కేటాయించారు. ఈ కేంద్రాలు పని చేయడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కేంద్రాల నిర్వహణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. సచివాలయాలకు ఏపీ ఫైబర్ నెట్ ద్వారా నెట్ కనెక్షన్ సమకూరుస్తున్నారు. ఫైబర్ నెట్ స్పీడు ఆధార్ కేంద్రాల పనిచేయడానికి సరిపోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా సచివాలయాల ఉద్యోగులు చెబుతున్నారు. ఈ కారణంగా కొత్తగా ఆధార్ నమోదుకు, పదేళ్లుగా తమ కార్డులను నవీకరించుకోవడానికి, అడ్రస్, పుట్టిన తేదీ వంటి సమస్యలు పరిష్కరించుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.మండలంలో ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు విజయనగరం, విశాఖపట్నం అనేక వ్యయ ప్రయాలకు గురయ్యి అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు మూడు సచివాలయాలకే ఆధార్ కేంద్రాల నమోదు కేటాయించడం వల్ల తమపై పని ఒత్తిడి పెరిగిపోతుందని సంబంధిత ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ కారణంగానే వీటి నిర్వహణ పట్ల అయిష్టంగా ఉన్నారు. కాగా ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడంపై ఎంపీడీఓ బి. శైలజను సంప్రదించగా కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా వీటిని ప్రారంభించలేకపోయామని, ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లామన్నారు. ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించడానికి సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లను కలెక్టరేట్‌కు పంపించామన్నారు. ఆ సమస్య పరిష్కారం అయిన వెంటనే వీటిని వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.


రెడ్డిపల్లి గ్రామ సచివాలయం

క్లాత్ సంచులు వినియోగించాలి : జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, జూలై 24 : నగర ప్రజలు పర్యావరణ పరిరక్షణ కోసం క్లాత్ సంచులను వినియోగించాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ కోరారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ నగర ప్రజలకు ఉచితంగా అందించేందుకు తయారు చేయించిన 30వేల క్లాత్ సంచులను కమిషనర్ తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం. జ్ఞాన సుందరం మాట్లాడుతూ నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ సౌజన్యంతో పలు కార్యక్రమాలు చేపట్టామని, అందులో భాగంగానే 30 వేల క్లాత్ సంచులను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. 15 వేల సంచులు జీవీఎంసీకి అందించగా మిగిలిన 15 వేల సంచులును తమ కంపెనీ ప్రతినిధులు ప్రజలకు ఉచితంగా అందిస్తారని చెప్పారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగర పరిరక్షణకు, పరిశుభ్రతకు, నగరాభివృద్ధికి ప్రజలను చైతన్యపరుస్తూ వారి అవగాహన కోసం కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత ఎంతో దోహదపడుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో నగరం దేశంలోనే ప్రథమ స్థానం సాధన దిశగా జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ ఆర్. శ్రీనివాసరావు, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎస్వీ రమణ, సీనియర్ మేనేజర్ కె. శ్రీకాంత్, పీఆర్ కన్సల్టెంట్ యూఎస్ శర్మ పాల్గొన్నారు.


క్లాత్ సంచులను ఆవిష్కరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్


స్వామివారికి తులసీ దళార్చన చేస్తున్న అర్చకుడు

అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, జూలై 24 :వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం సహస్రనామ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విధులకు ఆలస్యంగా సచివాలయ సిబ్బంది

కొమ్మాది, జూలై 24 : పీఎంపాలెం సచివాలయం సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ ఆరోపించారు.ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సచివాలయంలో తొమ్మిది మంది ఉద్యోగులు పని చేస్తుండగా బుధవారం ఉదయం 11 గంటలకు ఒక్కరే వచ్చారని తెలిపారు. నగరంలోని అన్ని సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగుల తీరు వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఉన్నతాధికారులు సిబ్బంది సమయ పాలనపై దృష్టిసారించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 24 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అంబేడ్కర్‌నగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాక్‌లు, శ్రీకాంత్‌నగర్ లేఅవుట్, కనక మహాలక్ష్మీనగర్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ ప్రాంతం, టీబీసీ పాయింట్, ఆరిలోవ ఆఖరి బస్టాప్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తగరపువలస, జూలై 24 : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ చిరంజీవిరావు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారిపై నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీబ్రా లైన్ల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్ పాల్గొన్నారు.

'పాచిమెట్ట కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి'

తగరపువలస, జూలై 24 : బాలాజీనగర్ సమీపంలో ఉన్న పాచిమెట్ట కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఒకటో వార్డు టీడీపీ నాయకులు కోరారు. బుధవారం వారు కాలనీని సందర్శించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, కాలువలు, వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలకులు, అధికారులు స్పందించి కాలనీలో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు సూరిబాబు, రాజేష్, సూర్య వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డీడీగా విశ్వనాథం

వెంకోజీపాలెం, జూలై 24 : ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్‌గా విశ్రాంత ఆచార్యులు పి. విశ్వనాథం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఏయూ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, మాజీ ఆచార్యులు సాంబశివరావు, రమణమూర్తి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిలిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 54, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 28, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజి, 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 35, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 85, అల్లం (పాతది) 150, బరబటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయ 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

కేంద్ర కారాగారంలో ముగిసిన సదస్సు

ఆరిలోవ, జూలై 24 : కేంద్ర కారాగారంలో కొత్త చట్టాలపై మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి అవగాహన సదస్సులు బుధవారంతో ముగిసాయి. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జైళ్ల శాఖ అధికారులు కొత్తగా వచ్చిన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ముగింపు సందర్భంగా ఐజీ సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందజేశారు. న్యూఢిల్లీకి చెందిన పోలీసు బ్యూరో ఆఫ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కేకే మీనా పర్యవేక్షణలో ఈ సదస్సులు జరిగాయి.


సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలు ఇస్తున్న ఐజీ

వుడా కాలనీలో వెలిగిన వీధి లైట్లు


మొగధారమ్మ ఆలయం సమీపంలో, వుడా కాలనీలో వెలిగిన లైట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధురవాడ, జూలై 24 : జీవీఎంసీ ఏడో వార్డు మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎట్టకేలకు వీధిలైట్లు వెలిగాయి. ఈనెల 21న 'మిథిలాపురి వుడా కాలనీలో అంధకారం' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు కుషీ షాపింగ్‌మాల్ నుంచి ఆర్టీసీ డిపో వరకు, మొగధారమ్మ ఆలయ రహదారి, వుడాకాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే దారి లో వీధి లైట్లును పునరుద్ధరించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో శారీరక ఉల్లాసం : డైట్ ప్రిన్సిపాల్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం, జూలై 24 : క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని డైట్ ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి అన్నారు. బుధవారం కళాశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా బీసీ ఆటలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత తరం సంప్రదాయ ఆటలను పిల్లలు మరిచిపోతున్నారని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ చిన్నతనం నాటి ఆటలు గురించి పిల్లలకు తెలపాలన్నారు. అనం తరం డైట్ సీనియరు అధ్యాపకులు ఎల్. సుధాకర్, ఎస్. త్రినాథరావు, పి. హారిణి ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బెచ్చాట, చదరంగం, కోతికొమ్మచ్చి, బొంగరాలాట, అష్టాచమ్మ, తొక్కుడు బిల్ల, టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట తదితర ఆటలను పరిచయం చేసి ఛాత్రోపాధ్యాయులతో ఆడించారు. ఈ కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు, అధ్యాపకులు నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఎం. మహాలక్ష్మి, జె. మాధవి, సోమయాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి 133వ జయంతి


అడవివరం శాఖా గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళి

ఎంవీపీ కాలనీ, జూలై 24 : గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతిని ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ కార్యదర్శులు ఎం. లలిత, ఎం. కల్పన, సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి వై. రమ తదితరులు అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయాధికారి కేవీపీ ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు.

సింహాచలం : గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకట రమణయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని రిటైర్డ్ హెచ్ఎం బండారు గంగునాయుడు అన్నారు. అయ్యంకి జయంతి పురస్కరించుకుని అడివివరం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎన్వీ నరసింహం ఆధ్వర్యంలో పలువురు నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో దేవస్థానం రిటైర్డ్ పర్యవేక్షణాధికారి వెలవలపల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు అప్పన్న ఆశీర్వచనాలు

సింహాచలం, జూలై 24 : జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను సింహాచలం దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అప్పన్న దేవాలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, దేవస్థానం వేద పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీటీ శ్రీకాంతాచార్యులు చతుర్వేద స్వస్తి వచనాలతో కమిషనర్‌కు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈఓ శాలువతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



సదస్సులో మాట్లాడుతున్న శేషమ్మ

మద్దిలపాలెం, జూలై 24 : ఆర్టీసీ ఉద్యోగులు ఇంటి నుంచి బైక్‌లపై విధులకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. బుధవారం మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.ఉద్యోగులు ప్రయాణికుల భద్రతే కాకుండా వారి భద్రతకు కూడా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమయానికి విధుల్లోకి రావడానికి బైక్‌లపై అతివేగంగా ప్రయాణాలు చేయకూడదని చెప్పారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయకూడని హితవుపలికారు. నిర్లక్ష్య ప్రయాణం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్లాపస్ ఛైర్మన్ వల్లభనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం జి. సత్యనారాయణ, డిపో మేనేజర్ ఎన్. అరుణకుమారి పాల్గొన్నారు.

భీమిలి క్రాస్ రోడ్డులో వాహన తనిఖీలు

ఆనందపురం, జూలై 24 : ఆనందపురం పోలీసుస్టేషన్ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు.నగర పోలీసు కమిషనర్ బాగ్చీ ఆదేశాల మేరకు ఎస్ఈబీ డీఎస్ఈవో బి. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ యు. సుబ్బారావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి.విజయనగరం, శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వస్తున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించి, వారి వివరాలు తీసుకున్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలనలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఎస్ఈబీ సీఐ రామకృష్ణ, సిబ్బంది రావు, దేముడురాజు, వహీదా రాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో జలజీవన్ మిషన్ బృందం పర్యటన

ఆనందపురం, జూలై 24 : మండలంలోని గొట్టిపల్లి, గిడిజాల, కణమాం పంచాయతీల్లో జాతీయ జల జీవన్ మిషన్ బృందం బుధవారం పర్యటించింది. ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశమై జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిల ఏర్పాటుపై ఆరా తీశారు. గతంలో అమలు చేసిన జల జీవన్ పథకాలను పరిశీలించి, వాటి గురించి ప్రజల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా అధికారి స్వప్న మాటాడుతూ ప్రతిఒక్కరూ నీటి నాణ్యత పరీక్షలు చేసుకుని నీటిని వినియోగించుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి పుల్లయ్య, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సర్పంచులు షిణగం అప్పలరాజు, గంటా జగదీష్, యర్ర అప్పలనాయుడు, ఎంపీడీవో ఎన్. అప్పలనాయుడు, ఈఓపీఆర్ రామారావు పాల్గొన్నారు.

చినవాల్తేరులో కృష్ణుడు విగ్రహం ఫౌంటెన్ ప్రారంభం

పెదవాల్తేరు, జూలై 24 : చినవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రి రోడ్డులో జీవీఎంసీ నిధులు రూ 5.8 లక్షలతో ఏర్పాటు చేసిన కృష్ణుడు విగ్రహం ఫౌంటెన్‌ను టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్న రెడ్డి బుధవారం ప్రారంభించారు.కార్యక్రమంలో 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమ రేంద్ర, నాయకులు మూర్తి యాదవ్, మురళి, బుజ్జి, చిన్న పాల్గొన్నారు.

సర్వసతీదేవి విగ్రహం ఏర్పాటు

ఎంవీపీ కాలనీ, జూలై 24 : గ్రేటర్ పరిధిలోని 18వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సర్వసతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలరావు, ఎంఈఓ బాలామణి, పాఠశాల హెచ్ఎం సురేష్, విగ్రహ దాత జామి నగేష్, రవికుమార్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఎంవీపీ కాలనీ, జూలై 24 : జిల్లాలో ఈపేడాది టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన ఆదివాసీ గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్టు ఆల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి కలిగిన వారు సర్టిఫికెట్లతో ఎం.వీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తులను అందించాలని కోరారు. పూర్తి వివరాలకు 9866434211 ఫోన్ నెంబరును సంప్రతించాలని వారు సూచించారు.

కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై హర్షం

పద్మనాభం (రూరల్), జూలై 24 : బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.బుధవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణానికి, నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు వల్ల నిరుద్యోగ సమస్య తగ్గుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేష్ కుమార్, సర్పంచులు గొర్రెపాటి వెంకటలక్ష్మి, మొకర లక్ష్మీ భవానీ, ఎంపీటీసీ సభ్యులు రమణరాజు, పిన్నింటి రమణ. నాయకులు నాయుడు, వెంకటరావు, కోన శ్రీనివాసరావు, సాగి కృష్ణామూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా పట్టభద్రుల స్నాతకోత్సవం

ఎండాడ, జూలై 24 : విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అవకాశాలను చేజిక్కించుకోవాలని ఎక్వైరస్ గ్రూప్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ శిల్పా గుప్తా పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పట్టభద్రుల స్నాతకోత్సవం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్)లోని ఎల్లా ప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు విద్యార్థులు పరిష్కారం చూపాలన్నారు. గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ గీతంలో వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు రూ 35.23 కోట్ల మేర స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామని, 55 మంది పరిశోధకులకు మూర్తి రీసెర్చ్ ఫెలోషిప్‌లు అందించామన్నారు. దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి 63 పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా విశాఖ క్యాంపస్ నుంచి 2023-24 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, ఇంటర్నేషనల్ బిజినెస్ ఎంబీఏ, బీబీఎం, బీకాం వంటి కోర్సులు పూర్తి చేసిన 2818 మందికి డిగ్రీ పట్టాలు, 99 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌లు, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 44 మందికి బంగారు పతకాలు అందజేశారు. అనంతరం శిల్పాగుప్తాని ప్రత్యేకంగా సత్కరించారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఎం. గంగాధరరావు, కార్యదర్శి ఎం. భరద్వాజ, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్‌లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

బక్కన్నపాలెంలో రైతుల ధర్నా


హుద్‌హుద్ ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కొమ్మాది, జూలై 24 : బక్కన్నపాలెంలో హుద్‌హుద్ ఇళ్ల వద్ద నిర్వాసిత రైతులు బుధవారం ధర్నా చేశారు. హుద్‌హుద్ తుపాన్‌లో ఇళ్లు కోల్పోయిన వారి కోసం సినీ పరిశ్రమ పెద్దలు ప్రభుత్వ సహకారంలో కొన్నేళ్ల క్రితం ఇక్కడ ఇళ్లు నిర్మించారు. ఎన్నికలకు ముందు వైసీపీ నేత కేకే రాజు ఉత్తర నియోజకవర్గానికి చెందిన 150 మందికి ఇక్కడి ఇళ్లు కేటాయించారు. ఇటీవల వారు ఆ ఇళ్లల్లో దిగడానికి ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. తమకు ఇళ్లు కేటాయించిన తరువాతే ఎవరికైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం రైతులు నవోదయ విద్యాలయం వెనుక నిర్మించిన హుద్‌హుద్ ఇళ్ల వద్ద ధర్నా నిర్వహించారు. అదే సమయంలో ఉత్తర నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులు కూడా ధర్నా చేపట్టారు. ఇంతలో పీఎంపాలెం పోలీసులు జోక్యం చేసుకుని ఎలాంటి ఆవేశాలకు గురికాకుండా ఇరువర్గాలు శాంతియుతంగా ధర్నా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి తమకు న్యాయం చేయాలని పోరాటం చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు ఉత్తర నియోజకవర్గానికి చెందిన వారికి ఇళ్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు తమకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పైడిరాజు, బి. పోతురాజు, సీపీఎం నాయకుడు డి. అప్పలరాజు, కేవీపీఎస్ నాయకులు పైడితల్లి, కనకమ్మ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ప్రమాద ఘంటికలు


రోడ్డు పక్కన పడిన రాయి

సింహాచలం, జూలై 24 : సింహగిరి ఘాట్ రోడ్డులో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దేవస్థానం సిబ్బంది ఇటీవల ఘాట్ రోడ్డును ఆనుకుని ఉన్న కొండపై చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో కొన్ని మొక్కలను వేళ్లతో సహా తీసేశారు. దీంతో అప్పటివరకు రాళ్లకు రక్షణ ఉన్న మట్టి వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొట్టుకుపోతోంది. చెట్ల వేళ్ల వద్ద ఉన్న మట్టి కిందకు జారిపోతుండడంతో చెట్లు కూలిపోయే స్థితికి చేరాయి. అలాగే రాళ్లు రోడ్డు మీదకు జారి పడుతున్నారు. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు భయాందోళన చెందుతున్నారు.

నారుమడుల సస్యరక్షణ చర్యలపై సూచనలు

భీమునిపట్నం (రూరల్), జూలై 24 : మండలంలోని తాటితూరు, నగరపాలెం గ్రామాల్లోని వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శాఖ సహాయ సంచాలకుడు పీవీ ప్రసాద్, ఏఓ కోమలి మాట్లాడుతూ నారుమడిలో నీరు ఎక్కువగా చేరితే మొలక శాతం తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపించాలని చెప్పారు. అనంతరం మడిలో కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీకాంత్, స్వాతి, కృపామణి పాల్గొన్నారు.

'పంచ గ్రామాల భూ వివాదం పరిష్కరించండి'

సింహాచలం, జూలై 24 : పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి సత్వరమే పరిష్కారం లభించే విధంగా కృషి చేయాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం నగరానికి చెందిన ఎమ్మెల్యేలను కోరారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల్లో పంచ గ్రామాల భూ వివాదంపై చర్చ జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు.

విద్యా రంగం సమస్యలు పరిష్కరించాలని వినతి

పద్మనాభం/పద్మనాభం రూరల్, జూలై 24 : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కమిటీ నాయకులు ఎంఈఓ రమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నెంబరు 117ను రద్దు చేసి 2021, ఏప్రిల్ 23 నాటి జీఓ 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీ, 1 నుంచి 5 తరగతుల వరకు ఒకే పాఠశాలగా నిర్వహించాలన్నారు. రాష్ట్రమంతా ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తొలగించి, పనిభారం తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరావు, సన్యాసిరావు, జిల్లా కౌన్సిలర్ రమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

పెదవాల్తేరు, జూలై 24 : దక్షిణ నియోజకవర్గంలోని 29, 30, 37వ వార్డులకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర నగరంలోని కార్యాలయంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి నీలాపు విజయానంద రెడ్డి, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ప్రకాశ్‌రెడ్డి, రామ్మోహన్, దామోదర్ యాదవ్, పొలిమేర శ్రీనివాసరావు, దిలీప్ వర్మ, రాంబాబు, ఉమ్మడి సుజాత పాల్గొన్నారు.

స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పద్మనాభం, జూలై 24 : హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, టీడీపీ నాయకులు బుధవారం ఎంఈఓ రమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక మతానికి చెందిన పాఠ్యాంశాలను బోధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. క్రీస్తుకు చెందిన పాఠాలు బోధించవద్దని చెప్పడానికి వెళ్తే డైరెక్టరు వీడియో విడుదల చేస్తూ బెదిరించారన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామానాయుడు, శ్రీనివాసరావు, మహేష్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్నాయుడు, ఆచారి పాల్గొన్నారు.